

లేదు. "ఓ.. గాడ్!" అంటూ ఆక్రోశించాడు ఆయన. "నేను ఎప్పుడు నిన్ను ప్రార్థించినా అనాయాస మరణాన్ని ప్రసాదించమని ప్రార్థించేవాడిని. ఇప్పుడు నా మరణాన్ని కొన్ని నిమిషాలు వాయిదా వేయమని వేడుకుంటున్నాను. నాకు మరో మనిషితో మాట్లాడగలిగే సామర్థ్యం ప్రసాదించు. ఈ విషయం ఇతరులకు తెలియకపోతే ప్రమాదం. అది కూడా నా కోసం కాదు. ప్రమాదం జరిగితే పోబోతున్న ప్రాణాలు కాపాడటానికి. దయచేసి నాకు కాస్త ఆరోగ్యాన్నివ్వు" అని ప్రార్థిస్తూ మంచంమీద ఒరిగిపోయాడు ఆయన.

ఆ గదికి ఉన్న కిటికీ నుండి నర్సుతో నవ్వుతూ మాట్లాడుతున్న డ్రైవర్ కనిపిస్తున్నాడు. వాళ్ళెవరూ ఇటు తిరిగి చూడటం లేదు. తమ తమ సంభాషణలో పూర్తిగా నిమగ్నమై ఉన్నారు.

ప్రకాష్ సింగ్ మృత్యువుతో పోరాడుతున్నాడు. డ్రైవర్ కానీ నర్సు కానీ తనవైపు చూడకపోతారా... అన్న ఆశతో ఆయన తన పోరాటాన్ని కొనసాగిస్తున్నాడు.



ఇంతలో డ్రైవర్ అద్దంలో నుండి కనపడుతున్న ప్రకాష్ సింగ్‌ని చూశాడు. ఆయన తన సహాయం అర్థిస్తున్నాడన్న ఆలోచన అతనికి తట్టలేదు. తిరిగి తల తిప్పి నర్సుతో సంభాషణ కొనసాగించాడు.

అప్పుడర్థమైంది ప్రకాష్ సింగ్‌కి - తను ఓడిపోయానని. తన జ్ఞానం తన వద్దే ఉండిపోతుంది. ఎవరికీ పంచే అవకాశం లేదు. అంతేకాదు, ఆయనకు మరో విషయం కూడా అర్థమయింది. తను లేకపోయినా తన కంపెనీ చిరకాలం దేశానికి సేవ చేయాలనుకున్నాడు. కానీ ఇప్పుడది అనుమానమే! ఇంత పెద్ద బ్లండర్ చేసిన కంపెనీకి మనుగడ కొనసాగించే హక్కు లేదు. తనతోపాటే తన కంపెనీ అంతరించిపోతుంది.

చనిపోతున్న చివరి క్షణాల్లో కూడా దేవుడు తనకెందుకు ఇంత శిక్ష విధించాడో ఆయనకు అర్థం కాలేదు.

పది నిమిషాల తరువాత లోపలకు వచ్చిన నర్సుకు మంచం మధ్య అచేతనంగా పడి ఉన్న ప్రకాష్ సింగ్ కనిపిం

చాడు.

ఆయన వయసురీత్యా అది ఊహించిన పరిణామమే కాబట్టి ఆమె పెద్దగా ఆందోళనపడలేదు. గబగబా ఆయన దగ్గరకు నడిచి, పరీక్షించి ప్రాణం పోయిందని నిర్ధారించుకుంది.

తరువాత మంచంమీద ఫైల్ తీసి పక్కనున్న టేబుల్ మీద పెట్టి ప్రకాష్ సింగ్ శరీరాన్ని మంచంమీద సర్ది, దుప్పటికప్పి డాక్టర్ని పిలవటానికి బయటకు నడిచింది ఆమె.

ఆ తరువాత ఆ ఫైల్ విషయం ఎవరూ పట్టించుకోలేదు.

★ ★ ★

"ఇదేమిటి ఇలా జరిగింది? నేను ఒకరికి ఉపయోగపడుతుందని ఇలా చేశాను తప్ప, ఒకరి ప్రాణం పోతుందని అనుకోలేదు" అన్నాడు ఆదిత్య.

ఆ మాటలు అంటున్నప్పుడు అతని గొంతులో నిజంగానే విషాదం ధ్వనించింది.

"జరిగిన దాంట్లో నీ ప్రమేయం కూడా ఉందేమో కానీ, జరిగిన ప్రతి విషయానికీ నువ్వే బాధ్యుడివి కాదు" చేతులు కట్టుకుని నిర్వికారంగా జరుగుతున్నది అంతా చూస్తున్న సహదేవుడు అన్నాడు.

ఇద్దరూ ప్రకాష్ సింగ్ చనిపోయిన హాస్పిటల్ గదిలో ఉన్నారు. అక్కడ ఇప్పుడిప్పుడే హడావుడి ఎక్కువవుతోంది.

ప్రకాష్ సింగ్ ఆరోగ్యం బాగాలేదని అందరికీ తెలిసిన విషయమే అయినా, ఉదయం వరకు మాట్లాడిన వ్యక్తి ఇంత హఠాత్తుగా చనిపోతాడని ఎవరూ అనుకోలేదు.

ఆయన పెద్ద కొడుకు స్వదేష్ సింగ్ హాస్పిటల్ కు చేరుకున్నాడు. అంత్యక్రియల ఏర్పాట్లు దగ్గరుండి చూసుకుంటున్నాడు.

"ముంబయిలో జరగవలసిన ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవాన్ని ఏమి చేద్దాం?" మేనేజర్ స్వదేష్ సింగ్ని అడిగాడు.

"అది ఆపకూడదు. పైగా నాన్నగారు బతికి ఉన్నా ఇలా ఒకరికోసం ఏ పనీ ఆగిపోవటాన్ని సమర్థించేవారు కాదు. ఆ వేడుకని దాని దోవన దాన్ని జరగనివ్వండి. అక్కడి విషయాలు మీరు చూసుకోండి. ఇక్కడ జరగవలసిన పనులు నేను చూసుకుంటాను" అన్నాడు స్వదేష్ సింగ్.

అంగీకారంగా తల ఊపుతూ ఆ మేనేజర్ బయటకు వెళ్ళిపోయాడు.

'నాన్నగారు బతికి ఉంటే ఈ ప్రారంభోత్సవం చూసి ఎంత ఆనందించేవారో' ప్రకాష్ సింగ్ శవాన్ని ఆప్యాయంగా చూసుకుంటూ మనసులో అనుకున్నాడు స్వదేష్ సింగ్.

అయితే చనిపోబోయే ఆఖరిక్షణం వరకూ ప్రకాష్ సింగ్ ఆ ప్రారంభోత్సవాన్ని ఆపాలనుకున్నాడని అతనికి అప్పుడు తెలిసే అవకాశం లేదు.

ఈ సంఘటనలన్నీ గమనిస్తున్నట్లు పక్క టేబుల్ మీద మౌనంగా పడి ఉంది ఫ్లైఓవర్ ఫైల్.

ఎవరి హడావుడిలో వారు అటు ఇటూ తిరుగుతూ ఆ ఫైల్ గురించి ఏమాత్రం పట్టించుకోలేదు.

జరుగుతున్న విషయాలను గమనిస్తున్న

ఆదిత్య దీర్ఘంగా నిట్టూర్చాడు. "మీరెన్న యినా చెప్పండి! జరుగుతున్న సంఘట నలు బాధాకరం. ఇందులో నా ప్రమేయం ఉండటం మరింత బాధాకరం. అదికూడా పక్కన పెట్టండి. జరగబోతున్న ప్రమాదం సంగతి ఏమిటి? ప్రకాష్ సింగ్ జరుగు తుందనుకున్న ఫ్లైఓవర్ ప్రమాదం సంగతి ఎవరికీ తెలియటంలేదు. పోనీ, ఎలాగోలా మనమే ప్రకాష్ సింగ్ లోకానికి చెప్పదల చుకున్న విషయాలు అందరికీ చెప్తే.." అన్నాడు.

"మౌనంగా జరుగుతున్న సంఘటనలు చూడటమే మనపని. పైగా విషయం నువ్వనుకుంటున్నట్లు రహస్యంగా లేదు. ఇంతకుముందే బయటకు వచ్చింది. చర్చ జరిగింది. అయినా ఎవరూ నమ్మలేదు. ఐ.ఐ.టి. స్టూడెంట్ చెప్పిన విషయం పత్రి కల్లోనే ప్రచురితమైంది. వాటన్నిటినీ పట్టించుకోని ప్రపంచం నీ మాటలు వింటుందన్న నమ్మకం ఏమిటి? " అన్నాడు సహదేవుడు.

"ఈ దారుణాన్ని జరగకుండా మనం ఏమీ చెయ్యలేమా? "

"మీ టీవీ ఛానెళ్ళలో కొన్ని ఛానెళ్ళు కేవలం వన్యప్రాణుల మీద ప్రోగ్రాములు చేయటానికి ఉంటాయి కదా! వాటిలో జింకని వేటాడుతున్న పులినీ, ఒకదాన్ని ఒకటి చంపుకుంటున్న అనేక జంతువు లనూ చూపిస్తుంటారు. నువ్వూ చూసే ఉంటావు. అవి తీసే కెమెరామేన్ తను తియ్యటం ఆపి వాటిని రక్షించవచ్చు కదా! అలా చెయ్యడేం? "

"మీరు ప్రతి ప్రశ్నకీ మరో ప్రశ్నతో తప్ప సరైన సమాధానం చెప్పరా? " విసుగ్గా అన్నాడు ఆదిత్య.

"ఎవరి ధర్మం వారు నిర్వర్తిస్తే చాలు. తనకు మాలిన ధర్మం పనికి రాదు"

"అయితే మన తక్షణ కర్తవ్యం? "

"ఇంకా మన పని అయిపోలేదుగా! నువ్వు చేసిన ఘనకార్యం ఇంకొకటి ఉందిగా! మరొక వ్యక్తి మేధస్సు తగ్గిం చావు గుర్తుందా? అక్కడ పరిస్థితి ఏమిటో చూడవద్దూ"

"నాకు భయమేస్తోంది" అన్నాడు ఆదిత్య.

"అయినా తప్పదు" అంటూ మాయం అయ్యాడు సహదేవుడు, అతనితోపాటే ఆదిత్య కూడా.



7

మహేష్ వయసు నలభై ఏళ్ళు. ఆ వయసులోనే అతను ఒక రాష్ట్రానికి ముఖ్య మంత్రి అయి రికార్డు సృష్టించాడు. రాజకీ యాల్లో యువకులు పైకి రావటమే కష్టమ నుకుంటున్న రోజుల్లో, ఏ రాజకీయ కుటుంబపు నేపథ్యం లేకుండా అంత చిన్న వయసులో ఉన్నత స్థాయికి చేరటం ఒక వింతే! అయితే అది అదృష్టం వలన సమ కూరలేదు. అతని మేధస్సు వలన సమకూ రింది.

ఎలాంటి దురంధరుడయినా, ఎంతటి రాజకీయ మేధావి అయినా ఇతను వేసిన ఎత్తులముందు చిత్తు కావలసిందే! అలా అని అతను ఎవరినీ చులకన చెయ్యడు. ప్రత్యర్థులెవరినీ అవమానించేటట్లు మాట్లా డడు. రాజకీయాల్లో కొత్త రూల్స్ ప్రవేశ పెట్టాడు.